## కొడవంటి కాశీపతిరావు

మినీ కథ

# దేవుళ్ళారా బ్రతకండి!

నేనా స్కూలుకు కొత్త హెడ్మాష్టరుగా వచ్చి చేరిన మరుక్షణంనుండి నాగుండెలు గుబగుబలాడ్డం మొదలెట్టేయి. తలెత్తి మీదికి చూడాలంటే భయం. తీరిగ్గా గోడ కానుకుని కూర్చోవాలంటే భయం. నడుం మీద చెయ్యేసుకుని స్తంభంమీద చెయ్యి పెట్టి హెడ్మాష్టరి పోజు కొట్టాలంటే భయం. అంతెందుకు తలుపులుతీసి లోపలికి అడుగు పెట్టాలంటే భయం భయం.

భక్తులు క్షణంసేపైనా దేవుణ్ణి ఏమరుస్తారేమోగాని మా పాఠశాల 'భవనం' మాత్రం పంచభూతాలకీ ఎప్పుడూ తృణమో పణమో అన్నట్టుగా పెంకో పెచ్చో రాలుస్తూ ఉడతాభక్తిని చూపుతూ ఉంటుంది.

గట్టుమీద వుండివుంటే నేనూ చిన్న చూపు చూసివుండేవాణ్ణే! లేదూ అటువంటి పాఠశాలల గురించి పట్టించుకోనందుకు మునిసిపాలిటీని విమర్శించేవాణ్ణి. వ్యాపారదృష్టితో విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్న ప్రభుత్వాన్ని పరిహాసించేవాణ్ణి. అటువంటి దరిద్రగొట్టు స్కూల్లో దీనమైన మొహాలు పెట్టుకుని పాఠాలు చెప్పుకుంటున్న మేస్టర్లనీ, పాఠాలు వింటున్న పిల్లల్నీ చూసి నోటికి చెయ్యడ్డం పెట్టుకుని వెక్కిరించేవాణ్ణేమో!

కాని అటువంటి పాఠశాలకి నేను ప్రధానోపాధ్యాయుణ్ణి!

విమర్శలూ, వెటకారాలూ అనవసరం. కారణాలూ, పరిస్థితులూ అప్రస్తుతం. ఇప్పుడు నేను తీసుకోవలసిన చర్య ఏమిటి అని ఆలోచించాను.

వెంటనే మునిసిపల్ కమీషనరుగారికొక అర్జీ పెట్టాను. మామూలుగా కాదు. బాజా భజంత్రీలతోకూడా. అంటే వార్డులోని ప్రముఖుల సంతకాలు సేకరించి మరీనూ–

వెంటనే ఈ పాఠశాలను పునాదుల్తోసహా పడగొట్టించవలసినదనిన్నీ, పాఠశాలకు మరో స్థలం చూపించవలసినదనిన్నీ లేనిపక్షంలో ముక్కుపచ్చలారని పసిపాపల ప్రాణాలకు ముప్పు వాటిల్లగలదనిన్నీ" దాఖలుపరిచేను.

ఏ షాపింగు కాంప్లెక్సో, మరో రోడ్ల టెండర్లో అయితే నిత్యపంట! ఇటువంటి పాఠశాలల గూర్చి పట్టిందుకుంటే ఏమొస్తుంది-బూడిద!

అంచేత సహజంగానే ఆ అర్జీని గూర్చి పట్టించుకోలేదు. కాని నేను హెడ్మాష్టర్ని. చూసిచూసి విసిగివిసిగి "పాఠశాల మార్చకపోతే మానేరు" కాస్త చూరు నిలబడేపాటి రిపేర్లన్నా చేయండి దేవుళ్ళారా!" అంటూ మరో అర్జీ దాఖలు చేసేను. ఉత్తి అర్జీ మాత్రమే కాకుండా ఈసారి పెర్సనల్‌గా శ్రీ మునిసిపల్ కమీషనరువారినీ, ఇంజనీరు మహాశయులనీ పదేపదే కలుసుకుని పరిస్థితులు విన్నవించుకున్నాను.

అర్జీ ఒక్కటే అయితే బుట్టదాఖలయ్యిండేది. మాటిమాటికి నా ముఖం కనపడ్డంతో 'పీడేమిటి పట్టుకుని వదల్దు' అనుకున్నారో ఏమో–రిపేర్ల నిమిత్తము

పదివేల రూపాయలు మంజూరైనట్టూ, సదరు రిపేర్లు జరుగుటకు వీలుగా ప్రధానో పాధ్యాయుని సహకరించవలసిందిగా కోరు తూనూ తాఖీదు వచ్చింది.

భారం దిగిపోయింది!

కొండెక్కినంత సంబరపడ్డాను.

వెనకప్రక్కనున్న ఖాళీ జాగాలో ఎలానో షిఫ్టు పద్ధతిద్వారా స్కూలుపని కంతరాయం లేకుండా ఏర్పాటు చేశాను.

నెల్లాళ్ళు గడిచేసరికి ముసలి హీరోగారు జీన్స్ వేసుకుని ఎవర్‌గ్రీన్ హీరో అనిపించు కున్నట్టుగా తయారైపోయింది మా స్కూలు.

పాఠశాల యథాప్రకారం పాత టైమింగ్స్ ననుసరించి మర్నాటి నుండి పని చేస్తుందని సర్క్యులర్ కూడా జారీచేసేను.

మర్నాడు ధీమాగా స్కూలుకు వెళ్ళను కదా-గునపాలూ, పారలూ, తట్టల్తో ఏభై అరవై మంది స్కూలు మీద దండెత్తి నట్టుగా మూగివున్నారు. "ఏమిటి తగువు, ఏమిటి విషయం" అని గాభరాపడుతూ అడి గేను.

"మరేంలేదు మేస్టారూ.... మీరు మొదట పెట్టుకున్న అర్జీ ఇప్పుడు మంజూరైంది. ఇప్పుడు పడగొట్టించెయ్యమని ఆర్డర్సు వచ్చేయి...." అంటూ ఆర్డరు కాపీని నా చేతిలో పెట్టేడు ఇంజనీరింగు సూపర్ వైజరు! ■

# పతితపతి ఆంతరంగికం!

నా నెత్తిమీది ఆకాశం నాపై కూలుతున్నది.
నేను కూర్చున్న చాప కింద నీరు చేరుతున్నది
నా నెక్‌టై నాకే ఉరిగా పరిణమిస్తున్నది
నా కొత్త బూటూ
నన్ను కరుస్తున్నది
నా సూటు నన్నే తినేస్తున్నది
నా చెయ్యే నా నేమ్ ప్లేట్‌కు నిప్పంటిస్తున్నది
నా రేజరే నా మీసాన్ని సగానికి తినేస్తున్నది
నేను చేపట్టిన నిలువుటద్దం
నా ముఖాన్ని అష్ట వంకరలతో చిత్రిస్తున్నది
నా అర్ధభాగమే అనర్థానికి పాల్పడుతున్నది
నా పిల్లలకు నా పోలికలు రాలేదు!

సూర్య ప్రకాశ్